నమస్తే తెలంగాణ
నల్లగొండ
8 | నల్లగొండ, శనివారం 24 మే 2025 | NALGONDA

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రాజకీయ కక్షతోనే కేసీఆర్‌పై కుట్రలు

- కాంగ్రెస్ వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకే నోటీసులు
- నేషనల్ హెరాల్డ్ కేసులో బయటపడుతున్న కాంగ్రెస్ బాగోతం
- సొమ్ముకరిది.. సోకొకరిది అన్నట్లు రేవంత్‌రెడ్డి తీరు
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి మే 23 : ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకోవడాన్ని ఓర్వలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కుట్రలు చేస్తున్నదని నకరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమాశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకే నోటీసుల డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అభివృద్ధి జరుగలేదని అనే రేవంత్ రెడ్డి సర్కారు తీరు సొమ్ముకరిది.. సోకరిది అన్న తీరుగా ఉందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, మిస్ వరల్డ్ పోటీలకు వచ్చిన అందాల తారలు కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి అడిగి తెలుసుకున్నారని తెలిపారు. యంగ్ ఇండియా సంస్థకు విరాళాల కోసం పదవుల పేరుతో ఒత్తిళ్లు, ప్రలోభాలు పెట్టిన కాంగ్రెస్ అగ్రనేతలు, రేవంత్‌రెడ్డి భాగోతం నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ నమోదు చేసిన చార్జ్ షీట్‌తో బయట పడిందన్నారు. అధికారం కోసం ముఖ్యమంత్రి కాక ముందు కాంగ్రెస్ పార్టీ పెద్దలకు రేవంత్ వందల కోట్ల రూపాయలు కట్టబెట్టిన వ్యవహారం కుండ బద్దలైందని తెలిపారు. 30 శాతం కమీషన్ ఇవ్వందే సొంత ప్రభుత్వంలో పనులు కావడం లేదని సాక్షాత్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యేనే బట్టబయలు చేశారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి పిల్లను ఇచ్చిన మామ సూదిని పద్మారెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరుగలేదని స్వయంగా చెప్పడం రేవంత్‌కు చెంపపెట్టు అన్నారు. కేసీఆర్‌ను రేవంత్ సర్కారు ఎందుకు వేధిస్తున్నదో ప్రజలకు చెప్పాలని నిలదీశారు. ప్రాణాలు ఫణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించినందుకా? కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి కోటి ఎకరాలకు సాగునీరు అందించినందుకా? రైతు బంధు, రైతు బీమా, నిరంతర ఉచిత విద్యుత్‌తో రైతును రాజు చేసినందుకా? మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి మంచి నీరు ఇచ్చినందుకా? ఎందుకో చెప్పాలని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు ఇప్పటివరకు 40 శాతం కూడా జరుగలేదని, కేంద్రాల వద్ద కుప్పలు వానకు తడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులకు రైతుల కష్టాలు పట్టించుకోవడానికి క్షణం తీరిక లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు బైరెడ్డి కరుణాకర్ రెడ్డి, యానాల అశోక్ రెడ్డి, కొండూరు శంకర్, తరాల బలరాం, జ్యోతి బలరాం, కోటి రెడ్డి, సుధీర్, సతీశ్, దుబ్బ మదు, సత్తిరెడ్డి, ప్రకాశ్, సాయి పాల్గొన్నారు.



భూదాన్‌పోచంపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసున్న మాజీ సర్పంచ్‌లు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- డబ్బులు లేకుంటే కోట్లు ఖర్చు చేసి అందాల పోటీలు ఎందుకు?
- ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మాజీ సర్పంచ్‌ల నిరసన

భూదాన్‌పోచంపల్లి, మే 23 : ప్రభుత్వం పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లు నిరసనకు దిగారు. భూదాన్‌పోచంపల్లిలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట శుక్రవారం బైఠాయించారు. అప్పులు తెచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడితే నేటికీ బిల్లులు చెల్లించకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఓవైపు డబ్బులు లేవంటూనే మరోవైపు అందాల పోటీకి కోట్ల రూపాయలు ఎందుకు ఖర్చు చేశారని రేవంత్ సర్కారును ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మన్నె పద్మా రెడ్డి, ఫకీరు లావణ్య, దేవేందర్‌రెడ్డి, మట్ట బాల మణి, సుదర్శన్, భిక్షపతి పాల్గొన్నారు.

మానవ హక్కుల వేదికకు సుబ్బా రావు రాజీనామా

- ఆపరేషన్ కగార్‌పై వేదిక మౌనాన్ని నిరసిస్తూ ప్రకటన

మిర్యాలగూడ, మే 23 : ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను మట్టుపెడుతున్నప్పటికీ మానవ హక్కుల వేదిక మౌనంగా ఉండడం పట్ల తాను మానవ హక్కుల వేదిక ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు వేదిక మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొల్లూరు సుబ్బారావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధ్య భారతంలో ఆదివాసుల కోసం పోరాడుతున్న మావోయిస్టులను ఆపరేషన్ కగార్ పేరుతో కాల్చి చంపుతున్నా మావన హక్కుల వేదిక మౌనం వహించడం క్షమించరానిదన్నారు. ఈ విషయమై హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జీవన్‌కుమార్‌తో మాట్లాడిన అనంతరం తాను రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. 91 ఏండ్ల వయస్సులో తాను ప్రజా ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొనలేకపోయినప్పటికీ అన్ని రకాల ప్రజా పోరాటాలకు మద్దతు తెలుపుతానని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, ఆదివాసీలపై ప్రభుత్వ

మాట్లాడుతున్న సుబ్బారావు

దమనకాండను ఆపి చర్చలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాగా, పదేండ్లపాటు పౌర హక్కుల సంఘంలో పని చేసిన సుబ్బారావు 2001 నుంచి మానవ హక్కుల వేదికలో వివిధ హోదాల్లో పని చేస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి

మిర్యాలగూడ, మే 23: ఆపరేషన్ కగార్‌ను ప్రభుత్వం వెంటనే ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో ప్రభుత్వం నరమేధం సాగిస్తుందన్నారు. ఇప్పటికే ఎంతో మంది మావోయిస్టులు చనిపోయారని పేర్కొన్నారు. ఆదివాసీల కోసం పోరాటం చేస్తున్న వారిని ప్రభుత్వం దుర్మార్గంగా చంపడం హేయమన్నారు. చర్చలకు వస్తామని సానుకూలంగా స్పందించినప్పటికీ అదేమీ పట్టించుకోకుండా కక్ష పూరితంగా ఎన్‌కౌంటర్లు చేయడం సరికాదన్నారు. అడవిలో ఉన్నవారు ప్రజల కోసం పోరాడుతున్నారే తప్ప వ్యక్తిగతంగా హింస చేయడం లేదని పేర్కొన్నారు. వారిని దేశద్రోహులుగా, ఉగ్రవాదులుగా కాల్చి చంపడం సరికాదన్నారు. అడవిలో ఉన్న సహజ వనరులు, ఖనిజ సంపద నిక్షేపాలు కాజేసి బడా కంపెనీలకు అప్పజెప్పడం కోసమే ప్రభుత్వం ఈ చర్యలకు దిగిందన్నారు. పెహల్గామ్‌లో 27 మంది పర్యాటకులను చంపిన ఉగ్రవాదులు కేంద్రం ఇప్పటివరకు పట్టుకోలేదని, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకోలేదని, ఏం సాధించారని యుద్ధం ఆపేశారని ప్రశ్నించారు.

దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్‌పై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్ విషయాలను ప్రజలు, అఖిల పక్షానికి వివరించాలని, పార్లమెంట్‌లో చర్చించాలని కోరారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, నాయకులు రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, రవినాయక్, వినోద్‌నాయక్, తిరుపతి రామ్మూర్తి, కృష్ణయ్య ఉన్నారు.

పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

మిర్యాలగూడ టౌన్, మే 23 : సరస్వతి నది పుష్కరాలకు మిర్యాలగూడ ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 24, 25 తేదీల్లో ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు డిపో మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ రెండు తేదీల్లో సాయంత్రం 7 గంటలకు డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సులు బయల్దేరుతాయని పేర్కొన్నారు. పుష్కరాలకు వెళ్లే భక్తులు సరస్వతీ పుష్కర స్నానంతోపాటు, కాళేశ్వర ముక్తేశ్వర స్వామి, ఘనపూర్, రామప్ప, వేయిస్తంభాల గుడి, భద్రకాళి ఆలయాన్ని దర్శించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. టికెట్ ధర పెద్దలకు రూ.1,500లు, పిల్లలకు రూ.800 చెల్లించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 92980 08888, 95025 00357, 81066 88736, 70366 32277 నెంబర్లను సంప్రదించాలని శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు.

విధుల నుంచి డీఎంహెచ్‌ఓ సస్పెన్షన్

ఎట్టకేలకు వైద్యారోగ్య శాఖ చర్యలు

- విచారణ జరుగుతుండగానే హెడ్డాఫీస్‌కు అటాచ్
- ఎల్‌బీనగర్ డీఎంహెచ్‌ఓకు సూర్యాపేట ఇన్‌చార్జి బాధ్యతలు

సూర్యాపేట, మే 23 (నమస్తే తెలంగాణ) : అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారిన సూర్యాపేట జిల్లా వైద్య ఆరోగ్య శాఖపై నలువైపులా విచారణ జరుగుతుండగానే డీఎంహెచ్‌ఓపై వేటు పడింది. జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలాన్ని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. జిల్లా వైద్యారోగ్య శాఖలో అవినీతి, అక్రమాలపై నమస్తే తెలంగాణ పత్రికలో వరుస కథనాలు ప్రచురితం కావడంతో ఉన్నత స్థాయిలో విచారణ చేపట్టారు. హైదరాబాద్ కేంద్రంగా వైద్యారోగ్య శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ పుష్ప రికార్డులు తెప్పించుకొని విచారణ చేపట్టగా, అక్రమాలు తేలినట్లు తెలిసింది. అనంతరం వైద్యారోగ్య శాఖ డైరెక్టర్, అదనపు డైరెక్టర్ల బృందం వచ్చి విచారణ చేసి పలు రికార్డులను తమ వెంట తీసుకువెళ్లారు. దాదాపు పదికిపైనే అంశాలపై విచారణ కొనసాగుతుండగానే దిగిమింగిన నిధులకు సంబంధించి పాత బిల్లుల కోసం తంటాలు పడుతూ వాటి కోసం కొత్తగా అక్రమాలకు తెరలేపినట్లు ఆరోపణలు వచ్చాయి. దానిపైనా నమస్తే తెలంగాణలో తాజాగా కథనం ప్రచురితం అవడంతో తొలుత డీఎంహెచ్‌ఓను విధుల నుంచి తప్పించాలని భావించిన ఉన్నతాధికారులు ఆ మేరకు వెంటనే నిర్ణయం తీసుకున్నారు. విధుల నుంచి సస్పెండ్ చేస్తూ హైదరాబాద్‌లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యాపేట ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓగా హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌కు చెందిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.చంద్రశేఖర్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇటీవల డీఎంహెచ్‌ఓ కోటాచలాన్ని విచారిస్తున్న రాష్ట్ర వైద్య శాఖ అధికారులు (ఫైల్)

కొనసాగుతున్న విచారణ

జిల్లా వైద్యాధికారి కోటాచలాన్ని విధుల నుంచి తొలగించినప్పటికీ అవినీతి, అక్రమాలపై ఉన్నత స్థాయి విచారణ కొనసాగుతుందని తెలిసింది. అనుమతులు లేని ఆసుపత్రుల్లో అర్హత లేని డాక్టర్లు విధులు నిర్వర్తించడం, అలాంటి వారికి ప్రతి సంవత్సరం రెన్యూవల్‌కు పర్మిషన్ ఇవ్వడంలో లక్షల రూపాయలు చేతులు మారాయనే ఆరోపణలు తెలిసిందే. అయినప్పటికీ స్థానిక అధికారులు మేనేజ్ చేసుకుంటూ వచ్చారు. అక్రమాల్లో మా వాటా మాకు రావాలి కదా అంటూ సూర్యాపేట డీఎస్పీ పార్థసారథి, పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు అటువంటి ఓ ప్రైవేట్ ఆసుపత్రిపై కేసు నమోదు చేసి రూ.25 లక్షలు డిమాండ్ చేయడం, రూ.16 లక్షలకు ఒప్పందం కుదుర్చుకోగా ఏసీబీకి చిక్కడం విదితమే. దాంతో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు సూర్యాపేటపై దృష్టి సారించి పూర్తి స్థాయి విచారణకు ఆదేశించారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగినుల వేతనాలు మింగేసిన విషయంలో తమకు అనుకూలంగా లెటర్ ఇవ్వాలంటూ బెదిరింపులకు దిగుతుండడం, దాదాపు 25 మంది వేతనాలు కాజేయగా ఒకరిద్దరి నుంచి తామే విధులు నిర్వహించి వేతనాలు తీసుకున్నామని చెప్పాలని ఒత్తిడి తేవడం, ఎన్‌హెచ్ఎం, కొవిడ్, నిధులు, ఫ్లెక్సీల ప్రింటింగ్ పేరుతోనూ నిధులు స్వాహా చేసిన ఆరోపణలు వెలుగులోకి రావడంతో డీఎంహెచ్‌ఓగా కోటాచలం ఉంటే విచారణ సక్రమంగా సాగదని భావించి మొదటగా విధుల నుంచి ఆయన్ని తప్పించారు. వైద్య ఆరోగ్యశాఖలో జరిగిన అవినీతి అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణలో జరిపి చర్యలు తీసుకోవాలని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు డిమాండ్ చేశారు.

బాలింత మృతిపై మెజిస్టీరియల్ విచారణకు ఆదేశం

- డాక్టర్ల నిర్లక్ష్యంపై కలెక్టర్ సీరియస్
- ప్రభుత్వ వైద్యులు ప్రైవేట్‌కు రెఫర్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

ఐసీడీఎస్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నీలగిరి, మే 23 : జిల్లాలో వైద్యాధికారుల తీరుపై కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు డాక్టర్ల పని తీరు సరిగ్గా లేదని, మార్పు రాకపోతే సహించేది లేదని హెచ్చరించారు. గత డిసెంబర్ నెలలో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింత రాజేశ్వరి మృతి చెందిన ఘటనపై మిర్యాలగూడలోని శీరిష ఆసుపత్రిపై మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో మాతృ మరణాలపై వైద్యారోగ్య శాఖ, ఐసీడీఎస్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దామరచర్ల మండలం జైత్రంతండాకు చెందిన ఆడావత్ రాజేశ్వరి కాన్పు కోసం మిర్యాలగూడలోని శీరిష ఆసుపత్రికి వెళ్లగా అక్కడ వైద్య పరీక్షలు చేసిన డాక్టర్ శీరిష చివరి నిమిషం వరకు రాజేశ్వరిని ఆసుపత్రిలో ఉంచుకుని అనంతరం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారన్నారు. 28న ప్రసవం అనంతరం రాజేశ్వరి మృతి చెందిన ఘటనలో నిర్లక్ష్యం వహించిన శిరీష ఆసుపత్రిపై మెజిస్టీరియల్ విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు. పేషెంట్ల అవగాహన లోపం, నిర్లక్ష్యం కారణంగా మాతృ మరణాలు సంభవించకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్త మొదలుకుని ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులకు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. గర్భం దాల్చిన నుంచి ప్రసవం వరకు నిరంతరం ఏఎన్‌సీ చెకప్‌తోపాటు ఈడీడీ ప్రకారం సుఖప్రసవం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మధ్యలో ఏదైనా ఆరోగ్య సమస్యతలెత్తితే పీహెచ్‌సీలో చికిత్స అందించాలని, అక్కడ సాధ్యం కాకపోతే ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేయాలని సూచించారు. అలాకాకుండా ప్రభుత్వ వైద్యులు అక్కడక్కడా ప్రైవేట్ దవాఖానలకు రెఫర్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటివి పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు వంటి కారణాల వల్ల ప్రసవం తరువాత మహిళలు మరణిస్తున్నారని, మరికొన్ని కేసుల్లో చికిత్స తీసుకోకపోవడం, పౌష్టికాహారంలోపం వల్ల మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ఇలాంటి కేసులు ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటున్నందున అక్కడ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డీసీహెచ్ఎస్ డా.మాతృ, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి, ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, సీడీపీఓలు, వైద్యాధికారులు, ఎంసీహెచ్ సూపర్‌వైజర్లు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్

- సూర్యాపేట ఎస్పీ నరసింహ

సూర్యాపేట టౌన్, మే 23 : వ్యవసాయ పనులు ప్రారంభించడానికి రైతులు సిద్ధమవుతున్నారని, అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని నకిలీ విత్తనాలు గుర్తించి సీజ్ చేయాలని ఎస్పీ నరసింహ కోరారు. సంబంధిత అధికారులు సమన్వయంగా పని చేసి రైతులకు నకిలీ విత్తనాలు సరఫరా జరుగకుండా చూడాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నకిలీ విత్తనాల నిర్మూలనకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఆరుగాలం కష్టపడే రైతు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత విత్తన సంస్థలు, డీలర్లు, వ్యాపారులపై ఉందని పేర్కొన్నారు. విత్తన వ్యాపార డీలర్లు బాధ్యతగా మంచి నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని సూచించారు. రైతులు, వ్యవసాయానికి నష్టం కలిగేలా నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని, పీడీ యాక్ట్ తప్పదని హెచ్చరించారు. సూర్యాపేట జిల్లా ఆంధ్రా ప్రాంతానికి సరిహద్దుగా ఉందని, ఇక్కడ నకిలీ విత్తనాలు ఎక్కువగా సరఫరా అయ్యే అవకాశం ఉందని, పటిష్టమైన నిఘాతో నకిలీ విత్తనాలు నివారించాలని తెలిపారు. రైతులతో సమావేశాలు నిర్వహించి చైతన్య పర్చాలని, గతంలో నకిలీ విత్తనాల కేసులతో సంబంధం ఉన్న వారిపై నిఘా ఉంచాలని ఆదేశించారు. రైతులు నాణ్యమైన కంపెనీ విత్తనాలు ఎంచుకోవాలని, లేబుళ్లు, ప్యాకింగ్ లేని విత్తనాలు కొనుగోలు చేయొద్దని సూచించారు. తక్కువ ధరకు వస్తున్నాయని గ్రామాల్లోకి వచ్చే మధ్యవర్తుల వద్ద విడి విత్తనాలు కొనుగోలు చేయొద్దని, ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి ఎక్కువ మొత్తంలో విత్తనాలు కొనుగోలు చేసే రైతులు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలపై అనుమానిత బ్రోకర్లు, డీలర్లు ఉంటే పోలీసులు, వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

అదుపుతప్పి కారు పల్టీ

- ఒకరు మృతి.. ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురికి గాయాలు

బీబీనగర్, మే 23 : మండల కేంద్రంలో కారు అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా.. ఏడుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం పెద్దమంగళవారం గ్రామానికి చెందిన చేగూరి రామస్వామి కుటుంబ సభ్యులతో కలిసి గురువారం కారులో యాదగిరిగుట్ట లక్ష్మీ నర్సింహస్వామి దర్శనానికి వచ్చారు. స్వామివారి దర్శనం అనంతరం శుక్రవారం తిరుగు ప్రయాణమయ్యారు. బీబీనగర్ మండల కేంద్రానికి చేరుకోగానే వరంగల్ – హైదరాబాద్ జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై కారు అదుపుతప్పి పక్కన ఉన్న సర్వీసు రోడ్డులో పడిపోయింది. దాంతో కారులో ఉన్న ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను చికిత్స కోసం భువనగిరి దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ చేగూరి రామస్వామి మృతిచెందాడు.

పల్టీ కొట్టిన కారు

గ్రామ పాలనాధికారి పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

నీలగిరి/భువనగిరి కలెక్టరేట్, మే 23 : గ్రామ పాలనాధికారి పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నల్లగొండ, యాదాద్రి భువనగిరి కలెక్టర్లు ఇలాత్రిపాఠి, హనుమంతరావు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున డిగ్రీ కళాశాలలో, భువనగిరి పట్టణంలోని వెన్నెల కళాశాలలో పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 25న నిర్వహించనున్న పరీక్షకు నల్లగొండ జిల్లాలో 276మంది, యాదాద్రి భువనగిరి జిల్లాలో 151 మంది హాజరుకానున్నట్లు వివరించారు. నల్లగొండలో పరీక్షల నిర్వహణకు అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ నోడల్ అధికారిగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని, అభ్యర్థులు 9 గంటల వరకు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పది గంటల తర్వాత అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఒరిజినల్ గుర్తింపు కార్డు, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫొటో హాల్ టికెట్‌పై అంటించి, మరొక ఫొటో నామినల్ రోల్ కోసం తీసుకురావాలని సూచించారు. బాల్ పెన్ తేవాలని, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఎనిమిది మంది డిబార్

రామగిరి, మే 21 : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షలో శుక్రవారం జరిగిన నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, ఐదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో ఎనిమిది మంది విద్యార్థులు డిబార్ అయినట్లు సీఓఈ డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం జరిగిన నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 5,132 మంది హాజరుకావాల్సి ఉండగా, 368మంది గైర్హాజరయ్యారు. సూర్యాపేట ఆర్‌కేఎల్‌కే డిగ్రీ కళాశాలలో ఇద్దరు, భువనగిరిలోని ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, ఆలేరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు డిబార్ అయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఐదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 1,282 మందికి గానూ 1,110 మంది హాజరయ్యారు. రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు.

28 నుంచి మహిళలకు సేఫ్టీ, సెక్యూరిటీపై ఉచిత శిక్షణ

నీలగిరి, మే 23 : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ మహిళలకు ఈనెల 28 నుంచి దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం(మహిళా ప్రాంగణం)లో సేఫ్టీ–సెక్యూరిటీపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మేనేజర్ ఎ.అనిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల 13 నుంచి 21 సంవత్సరాల వయస్సు కలిగిన ఎస్టీ, ఎస్సీ బాలికలు, యువతుల కుల ధ్రువీకరణ, ఆధార్ జిరాక్స్‌తో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈనెల 28లోగా కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 76600 22517, 08682 244416 నంబర్లను సంప్రదించాలని సూచించారు.